జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php




సంపుటి 9 సంచిక 159 హైదరాబాద్, సెప్టెంబర్ 08 మంగళవారం 2026 8 పేజీలు వెల : 5.00





# అసెంబ్లీ వద్ద ఉద్రిక్తత

## బీఆర్ఎస్ ఆందోళనపై సీఎం రేవంత్ అత్యవసర భేటీ

- స్పీకర్‌పై తాతా మధు వ్యాఖ్యల వీడియో విడుదల
- బీఆర్ఎస్ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: కాంగ్రెస్ ఎమ్మెల్యేల వినతి
- తొందరపడి వివాదాస్పద వ్యాఖ్యలు చేయొద్దు: రేవంత్ సూచన

హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి : అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీయడంతో తెలంగాణ రాజకీయాలు వేడెక్కాయి. ఇదే సమయంలో శాసనసభ స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మంత్రులు, కీలక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో అత్యవసరంగా సమావేశమయ్యారు.

### ఉదయం ఘటనలపై ఆరా

అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న పరిణామాలపై సీఎం వివరాలు తెలుసుకున్నారు. బీఆర్ఎస్ సభ్యులు నల్ల దుస్తులతో రావడం, ఆందోళన సందర్భంగా చోటుచేసుకున్న వివాదంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్పీకర్, పోలీసు యంత్రాంగాన్ని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో ఫుటేజ్‌లను పరిశీలించారు. బీఆర్ఎస్ రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నా.. కాంగ్రెస్ సభ్యులు తొందరపడి ఎలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయవద్దని సూచించినట్లు తెలిసింది.



### తాతా మధుపై చర్యలకు డిమాండ్

స్పీకర్ పదవిలో ఉన్న దళిత నేతను ఉద్దేశించి ఎమ్మెల్సీ తాతా మధు అనుచితంగా, అహంకారపూరితంగా మాట్లాడారని కాంగ్రెస్ ఎస్సీ ఎమ్మెల్యేలు సీఎంకు ఫిర్యాదు చేశారు. తాతా మధుతో పాటు ఘటనకు బాధ్యులైన బీఆర్ఎస్ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పీకర్ పదవికి, శాసనసభ గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలను ఉపేక్షించరాదని వారు పేర్కొన్నారు.

### వీడియో విడుదల

మరోవైపు తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసింది. దీంతో వివాదం మరింత ముదిరింది. వీడియో ఆధారంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# తెలంగాణలో మరోసారి 'సర్' గడువు పొడిగింపు




హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి : తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు ఉన్న గడువును పొడిగించింది. ముందుగా ఈ నెల 16 వరకు ఉన్న గడువును అక్టోబర్ 7 వరకు పొడిగించినట్లు తెలిపింది. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ అనంతరం వాటి పరిశీలన, పరిష్కార ప్రక్రియ కొనసాగనుంది. ఈ ప్రక్రియను నవంబర్ 5లోగా పూర్తి చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం పూర్తైన తర్వాత నవంబర్ 9న తెలంగాణలో తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు.

## ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు.. అసెంబ్లీ స్పీకర్ భావోద్వేగం



హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి : తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. మధు వ్యాఖ్యలతో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. అసెంబ్లీలో మంత్రి సీతక్క ప్రసంగిస్తుండగా.. ఒక్కసారిగా భావోద్వేగానికి గురయ్యారు. కంటనీరు పెట్టుకున్నారు. అటు సీతక్క సైతం కన్నీరు పెట్టుకున్నారు. ప్రసాద్ కుమార్ తల్లిని కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని సీతక్క ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అయితే, స్పీకర్‌పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియోను సీఎంవో విడుదల చేసింది. ఈ క్రమంలోనే తాతా మధుపై చర్యలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. సభ నుంచి తాతా మధును బహిష్కరించే యోచనలో చైర్మన్ ఉన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు కోసం బీజేపీ రాజీలేని పోరాటం: బండి సంజయ్



హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి : రాజకీయ డ్రామాలకు ఒక నియోజకవర్గం ఉంటే అందులో కాంగ్రెస్, బీఆర్ఎస్ కూటమి బంపర్ మెజారిటీతో గెలుస్తుందని, ఈ రెండు పార్టీలు ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాలని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. తీవ్రంగా ఎద్దేవా చేశారు. పార్లమెంట్ లోపల రాహుల్ గాంధీ నల్ల దుస్తులు ధరించి నిరసనలు, నినాదాలు చేస్తూ డ్రామాలు ఆడుతుంటే, ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య స్వేచ్ఛను గౌరవిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ సైతం అదే కాంగ్రెస్ స్క్రిప్ట్‌ను కాపీ కొడుతోందని, ఈ రెండు పార్టీల రాజకీయ నాటకాలకు రాష్ట్ర పోలీస్ వ్యవస్థను బలి చేయడం సమంజసం కాదని ధ్వజమెత్తారు.కేవలం కెమెరాల కోసమే కాంగ్రెస్, బీఆర్ఎస్ పాకులాడుతున్నాయని, కానీ బీజేపీ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజల పక్షాన పోరాడుతోందని బండి సంజయ్ స్పష్టం చేశారు. తెలంగాణలో రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం, 8 లక్షల మంది విద్యార్థుల నుంచి సంతకాలు సేకరించి శాంతియుతంగా మహాధర్నా చేయాలని సంకల్పిస్తే ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని మండిపడ్డారు. విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తే అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది హెడ్‌లైన్స్ కోసం చేస్తున్న ఆరాటం కాదని, తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తు కోసం బీజేపీ చేస్తున్న న్యాయపోరాటమని ఆయన తేల్చి చెప్పారు.

## తెలుగు రాష్ట్రాల జల వివాదం.. సీడబ్ల్యూసీ కీలక సమావేశం



ఢిల్లీ, ప్రజాపాలన : ఆంధ్రప్రదేశ్ – తెలంగాణ రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారంపై ఢిల్లీ కేంద్ర జల సంఘంలో సీడబ్ల్యూసీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశం 10:30 గంటలకు ప్రారంభమైంది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై అధికారులు చర్చించారు. 2026 జనవరిలో ఇరు రాష్ట్రాల సీఎంలు, జలశక్తి మంత్రి, ఉన్నతాధికారుల భేటీకి కొనసాగింపుగా ఇవాళ సమావేశం నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలపై అజెండాను సీడబ్ల్యూసీ ఖరారు చేయనుంది. కేంద్ర జలసంఘం చైర్మన్ నేతృత్వంలో జరిగే ఈ భేటీకి ఇరు రాష్ట్రాల అధికారులు హాజరుకానున్నారు. 2026 జనవరిలో జరిగిన భేటీ తర్వాత ఇప్పటివరకు అజెండా ఖరారు కాలేదు. ఇరు రాష్ట్రాల నుంచి ఆయా అంశాల జాబితా ఇవ్వాలని పలుమార్లు కేంద్ర జల సంఘం లేఖలు రాసిన విషయం తెలిసిందే. ఇరు రాష్ట్రాల నుంచి స్పందన లేకపోవడంతో రెండు రాష్ట్రాల అధికారులను ఈరోజు జరిగిన సమావేశానికి సీడబ్ల్యూసీ చైర్మన్ పిలిచారు.

## ఇస్రో ప్రైవేటీకరణ ఉండదు: చైర్మన్ వి.నారాయణన్



బెంగళూరు, ప్రజాపాలన : ఇస్రో ప్రైవేటీకరణపై ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనలకు ఆ సంస్థ చైర్మన్ వి.నారాయణన్ తెరదించారు. ఇస్రోను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని చెప్పారు. ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనలపై వారితో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం పెరిగినా.. ఇస్రోకు ముప్పు లేదని తెలిపారు. బెంగళూరు స్పేస్ ఎక్స్‌పోలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అంతరిక్ష రంగంలో ప్రైవేటు పరిశ్రమల పాత్ర కొత్తదేమీ కాదని నారాయణన్ పేర్కొన్నారు. విస్తృత బాధ్యతలు చేపట్టేలా ఇస్రో మరింత శక్తిమంతంగా మారుతుందన్నారు. ప్రస్తుతం సుమారు 450 పరిశ్రమలు ఇస్రోతో కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. దేశ అవసరాలకు ఏటా దాదాపు 50 లాంచ్ వెహికిల్స్ అవసరమని.. ఆ స్థాయిలో ప్రయోగ సామర్థ్యాన్ని పెంచాలంటే ఇస్రోతో పాటు మరింత విస్తృత వ్యవస్థ అవసరమని వివరించారు.